కొల్లేరు గ్రామాల్లో అటకెక్కిన అభివృద్ధి

- కూటమి ప్రభుత్వం హయాంలో కానిరాని నిర్మాణ పనులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.కోట్ల నిధుల ఖర్చు
- గుడివాకలంకలో అభివృద్ధిని విస్మరించిన నాయకులు

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొల్లేరు పరివాహక ప్రాంతాల పరిధిలోని గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయి. ముఖ్యంగా ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామమైన గుడివాకలంకలో అభివృద్ధి అటకెక్కింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనా ఒక్క అభివృద్ధి పని గ్రామంలో ప్రారంభం కాలేదు. అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సాధారణ పాలన వ్యవహారాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత నెలరోజుల కిందట స్థానిక ప్రజాప్రతినిధి చింతమనేని ప్రభాకర్ గ్రామంలో పర్యటించారు, గ్రామాభివృద్ధికి సహకరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కాని నేటికీ గ్రామాల్లో ఒక్క రోడ్డు లేదా డ్రెయినేజీ, కుళాయి తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు ప్రారంభించిన దాఖలాలు కానరాలేదు. అర్హులైనవారు ఉన్నప్పటికీ ఒక్కరికి కూడా హౌసింగ్ రుణం మంజూరు కాలేదు. కొత్త పింఛన్ల ఊసే లేదు. ఈ ఏడాది జారీ చేయాల్సిన మత్స్యకారుల గుర్తింపుకార్డులు నేటికీ జారీ కాలేదు. కూటమి ప్రభుత్వ పాలన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దూరంగా సాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనీసం గోతులమయమై ప్రమాదకరంగా మారిన ప్రధాన రోడ్డుకు మరమ్మతులు, ఎస్సీ, బీసీ కాలనీ ముంపుబారిన పడకుండా ప్రధాన డ్రెయిన్ ప్రక్షాళన చేయాల ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో గ్రామం అభివృద్ధిలో పరుగులు తీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. గ్రామ జనాభా ఆధారంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.60 లక్షల రూర్బన్ నిధులతో గ్రామ కూడలిలో భారీ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. కొల్లేరు గ్రామాల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు గ్రామ పరిసరాల్లో రూ.4.50 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మించిన సంగతి తెలిసిందే. దీనికి తోడుగా రూ.27 లక్షల జలజీవన్ మిషన్ నిధులు వెచ్చించి ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్ వేసారు. రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రామ పంచాయతీ తాగునీటి చెరువుల చుట్టూ కంచె వేసారు. రూ.1.50 కోట్లతో జగనన్న కాలనీలో మెరక పనులు పూర్తి చేసారు. సుమారు 100 మందికి ఇళ్ల స్థల పట్టాలు అందించారు. రూ.80 లక్షలు ఉపాధి హామీ పథకం, రూర్బన్ నిధులు వెచ్చించి సీసీ రోడ్లు, మరో రూ.15 లక్షల ఖర్చు చేసి డ్రెయినేజీ నిర్మించారు. నాడు–నేడు మొదట విడతలో భాగంగా అధికారులు రూ.14.5 లక్షలు ఖర్చు చేసి స్థానిక మండల పరిషత్ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, ఫ్లోరింగ్, బల్లలు ఏర్పాటు చేసారు. రెండో విడతలో భాగంగా రూ.1.95 కోట్లతో జెడ్పీ పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించారు.


గుడివాకలంక పరిసరాల్లో గోతులమయమైన ప్రధాన రోడ్డు


గుడివాకలంకలో నిర్మించిన సబ్‌స్టేషన్


గతంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

సంక్షేమ పథకాలతో లబ్ధి

చేపల సాగు, సంప్రదాయ చేపల వేటతో జీవనోపాధి పొందుతున్న ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సబ్సిడీతో లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేసింది. వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా 527 మంది రూ.1,31,75,000, అమ్మ ఒడి పథకం ద్వారా రూ.2,66,13,000 లబ్ధిదారులు అందుకున్నారు. జగనన్న విద్యా దీవెన ద్వారా విద్యార్థులు రూ.41లక్షలు, ఆసరా పథకం ద్వారా 770 మంది డ్వాక్రా సంఘాల సభ్యులు రూ.2,01,33,000 లబ్ధి పొందారు. 550 మంది ప్రతి నెలా రూ.18.76 లక్షల పింఛన్ అందుకున్నారు.

సంక్షేమ పథకాల ఊసేలేదు

వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పథకాలు ఇప్పుడు ఎక్కడా కనబడడం లేదు. ప్రజలు సంక్షేమ పథకాలు కావాలంటున్నారు. గత ఐదేళ్లలో ప్రతి రెండు నెలలకు ఒక పథకం అమలు చేసారు. పేదలందరి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఆ డబ్బులతో ప్రజల అవసరాలు తీరాయి. ఇప్పుడు అంతా తారుమారయ్యింది. ఒక్క సంక్షేమ పథకం ఇవ్వడం లేదు.

– బలే దైవత్వం, గ్రామస్తుడు

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు పూర్తయ్యాయి. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను సబ్‌స్టేషన్ నిర్మించి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇప్పుడు వర్షాకాలమైనా, ఎండాకాలమైనా మాకు విద్యుత్ సమస్యలు లేవు. గ్రామంలో సంక్షేమ పథకాలు పొందిన కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించేది. ఇప్పుడు అంతా తారుమారు అయ్యింది. అభివృద్ధి పనులు కొనసాగడం లేదు. – బలే. బలరామయ్య, గ్రామస్తుడు

క్లుప్తంగా

బాలల భవితను కాపాడండి


ర్యాలీలో మాట్లాడుతున్న బాల వికాస్ భారతి ప్రెసిడెంట్ కట్టా సత్యనారాయణ

ఏలూరు (టూటౌన్): బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో 29వ డివిజన్, టైటస్ నగర్, అర్బన్ హెల్త్ సెంటర్ కమ్యూనిటీ హాల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా యుద్ధాలు వద్దు–బాలల భవితను కాపాడండి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బాల వికాస్ భారతి ప్రెసిడెంట్, న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ యూఎన్‌ఓ పొందుపరిచిన మానవ హక్కుల చాప్టర్లో భాగంగా బాలలకు ప్రత్యేకమైన నాలుగు రకాల హక్కులు జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యం పొందే హక్కు రూపొందించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం శొంఠ్యాల కస్తూరిరావు, మానవతా సంస్థ నాయకులు పి. రత్నాకర్‌రావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కళలు బాలల మనోవికాసానికి దోహదం చేస్తాయన్నారు. పోడూరి కనకదుర్గ, సుధ, పద్మ,మన్మోహిని, మేతర అజయ్ బాబు కూచిపూడి సత్యనారాయణ, సోమ్లా నాయక్ పాల్గొన్నారు. ఆలపాటి నాగేశ్వరరావు మానవతా సంస్థ విద్యానిధి చైర్మన్ గారి సహకారంతో బాల బాలికలకు పౌష్టికాహారం అందజేశారు.

దేశ ప్రగతిలో సహకార సంఘాలకు ప్రధాన పాత్ర


సహకార ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీనివాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశ ప్రగతిలో సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఏ.శ్రీనివాస్ అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో శుక్రవారం ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాలు లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నారన్నారు. సహకార వారోత్సవాల ఇన్‌ఛార్జి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సభ్యులతో సహకార ప్రతిజ్ఞ చేయించారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కృష్ణ మోహన్, అధికారులు ఎం. నరసింహారాజు, సుధాకర్, ఏకెఎస్ మూర్తి పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఖాతాలను పునరుద్ధరించుకోండి

ఏలూరు (టూటౌన్): పోస్టాఫీస్‌లలోని ఖాతాలను ఈ నెల 30వ తేదీలోగా పునరుద్ధరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎఫ్ఎస్) జి. శివనాగరాజు కోరారు. శుక్రవారం ఏలూరు పట్టణ పరిధిలోని ఇశ్రాయేల్ పేటలోని శివగోపాలపురం సచివాలయంలో, ఎర్రంపల్లి (ప్రగడవరం)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎఫ్ఎస్) జి. శివనాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలన్నారు.దీనికోసం ఈ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఏలూరు డివిజన్ పరిధిలోని 248 పోస్టాఫీసుల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్. శ్రీకర్ బాబు తెలియజేశారు. కార్యక్రమంలో ఐ.పి.పి.బి, రీజనల్ మేనేజర్, విజయవాడ సుబ్బారావు ఏలూరు డివిజన్ ఐ.పి.పి.బి సీనియర్ మేనేజర్ కె. రాజేష్, ఏలూరు నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి. దుర్గారావు, డి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎమ్మెల్సీ ఓటరు నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో గ్రాడ్యుయేట్లకు ఓటర్లుగా నమోదు చేసుకునే కార్యక్రమాన్ని నగరానికి చెందిన ఫ్లాష్ టీమ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్టు స్థానిక 23వ డివిజన్ కార్పొరేటర్ కలవకొల్లు సాంబ ఓ ప్రకటనలో తెలిపారు. 2021 నవంబర్ 1వ తేదీ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి ఓటరుగా నమోదు చేసుకునే అర్హత ఉంటుందన్నారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకూ స్థానిక నరసింహారావు పేటలోని ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న ఫ్లాష్ టీమ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిబిరం నిర్వహిస్తారన్నారు. అందరూ కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదుకు డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఓటరు ఐడీ, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు. వివరాలకు 9248889995, 9490886853 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

18న రామకోటిలో కోటి దీపోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్న సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యభిక్షా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీన ప్రాంగణంలో కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొట్టు మధు వెంకటరావు తెలిపారు శుక్రవారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు 18వ తేదీలోపు నమోదు చేసుకున్న నూట యాభై మూడు జంటలకు మాత్రమే దీపోత్సవంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. పూజా సామగ్రి ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. లక్ష ఒత్తుల దీపం వెలిగించే విధంగా భక్తులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. దీపోత్సవం సందర్భంగా ద్వారకాతిరుమల, అన్నవరం, విజయవాడ అమ్మవారి ప్రసాదాలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. హరే కృష్ణ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అన్నదాన సమాజం ప్రతినిధులు కొట్టు మనోజ్, సామర్ల కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


వ్యాధుల వ్యాప్తి- నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): వాతావరణం మారుతున్నప్పుడు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్ర పాటించి ఆరోగ్యంగా జీవించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జే. గోవిందరావు సూచించారు. స్థానిక లంబాడి పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫిల్ హౌస్ పేట ప్రాంతంలో ప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనారోగ్య సమస్య సంభవిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని గోవిందరావు ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ట్వింకిల్ , హెల్త్ సూపర్వైజర్ నాగమల్లేశ్వరావు హెల్త్ అసిస్టెంట్స్ మేక శ్రీనివాసరావు రమేష్ బాబు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం నగరం ఆధ్యాత్మికతతో పరవశించింది. నగరంలోని అన్ని శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పవర్ పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం, అన్నపూర్ణ అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ఆకాశదీప పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించి విశేష హారతి సేవ చేశారు. రాత్రి జ్వాలాతోరణ పూజలు, స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీప పూజ, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం జ్వాలా తోరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు పర్యవేక్షించారు. స్థానిక అగ్రహారంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగబాబు పర్యవేక్షించారు. దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి సాయంకాలం 6 గంటల నుంచి ప్రదోషకాలంలో అభిషేకం అనంతరం విశేష అలంకరణ, అర్చన చేశారు. అనంతరం స్వామి వారికి జ్వాలా తోరణ పూజలు చేసి పల్లకి సేవ నిర్వహించారు. వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దక్షిణపు వీధి జలాపహారేశ్వర స్వామి దేవస్థానం, మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం, అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేట మల్లికార్జున స్వామి దేవస్థానం, పర్వత వర్ధని సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలలో విశేష అభిషేకాలు, నిత్య పూజలు, స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.


విశేష అలంకరణలో పవర్‌పేట కాశీ విశ్వేశ్వర స్వామి


పత్తేబాద శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పత్తేబాద చౌడేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి


పత్తేబాద శివాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఆటో డ్రైవర్లను ఆదేశించారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో నగరంలోని ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు పాటించాల్సిన రహదారి భద్రత నిబంధనలను వివరించారు. డ్రైవర్లు తమ ఆటోలకు సంబంధించిన బీమా, కాలుష్య, ఫిట్‌నెస్ తదితరాలను ఎప్పుడు చెల్లుబాటులో ఉంచుకోవాలని, లైసెన్స్ లేకుండా ఆటో నడపడం నేరమన్నారు. లైసెన్స్ లేకుండా ఆటో నడిపితే రూ. 5000 జరిమానా విధిస్తామన్నారు. మన రాష్ట్రములో గతేడాది 25 వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయని, అందులో 12 వేలమంది మరణించారని, 27 వేల మంది గాయపడ్డారని, ఏలూరు జిల్లాలో గతేడాది 633 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని, వాటిలో 284 మంది ప్రాణాలు కోల్పోగా, 617 మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. 2024 ఏడాదిలో సెప్టెంబర్ మాసం వరకు 419 రోడ్డు ప్రమాదాలు జరగగా 214 మంది మరణించారని 440 మంది తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. ప్రతి రహదారి ప్రమాదం వెనుక డ్రైవర్ నిర్లక్ష్యం తప్పక ఉంటుందని, దానిని సరిచేసుకుంటే ప్రమాదాలను చాలావరకు నివారించగలమన్నారు. రహదారి ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంతో, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, మోటార్ వాహన తనిఖీ అధికారులు ఎండీ విఠల్, బి.శేఖర్, ఎస్. జగదీష్, వైఎస్‌వీ కల్యాణి, జీ.స్వామి, పీ.నరేంద్ర, డీ. ప్రజ్ఞ పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీమ్

సైనిక్ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సైబర్ సెల్ ఎస్సై

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, సైబర్ సెల్ ఎస్సై మధు వెంకటరాజా స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం సైనిక్ ప్రోగ్రామ్ సంబంధిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సమాజంలో సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అనర్థాలను సైనిక్ కార్యక్రమాల ద్వారా విద్యార్థినీ విద్యార్థుల్లో అవగాహన కల్పించి వారి ద్వారా సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాల నివారణ కోసం లఘు చిత్రాలను రూపొందించాలన్నారు. విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించగా, ఈ చిత్రాల ద్వారా ప్రజల్లో రహదారి భద్రత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంలో తగిన మార్గాలను సూచించారు. సైనిక్ క్విజ్ పోటీలో ప్రతిభ చూపిన వారికి టీ షర్టులను బహుమతులుగా అందించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు మాదక ద్రవ్యాల దూరంగా ఉండి ఉజ్వలమైన భవిష్యత్‌ను నిర్మించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాదక ద్రవ్యాల వినియోగంపై, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. గరికిపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. గరికిపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికిపాటి కాళిదాసు, మైలవరపు గురుశర్మ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. నారాయణరావు, సోషల్ వర్కర్ చలసాని సురేంద్ర, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	220
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	92
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	30-56	ములక్కాడలు	07, 10
బెండకాయలు	28	కంద	80
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	60
కాకర కాయలు	34	కీరా దోస	28
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	88
బీరకాయలు (పందిరి)	34	అల్లం	80
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	15
దొండకాయలు	24	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	15
ఉల్లిపాయలు	38-55	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44